స్తంభం ఎక్కి.. జంపర్ వేసి

కరెంట్‌ను పునరుద్ధరించుకున్న గ్రామ యువకులు.. 7 గంటలుగా కరెంట్ లేక గ్రామస్థుల అవస్థలు



బయ్యారం, ఆగస్టు 20: విద్యుత్తు అంతరాయంతో ఇబ్బంది పడిన గ్రామస్థులు స్వయంగా మరమ్మతులు చేసుకుని కరెంటు సరఫరాను పునరుద్ధరించుకున్నారు. మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం కోటగడ్డ ఫీడర్ పరిధిలోని చర్లపల్లి తండాలో షార్ట్ సర్క్యూట్‌తో విద్యుత్తు వైరు తెగిపోయింది. రామచంద్రాపురం పంచాయతీ పరిధిలోని పెంకుతండా, కేసీఆర్ కాలనీకి సోమవారం మధ్యాహ్నం 2 నుంచి ఏడు గంటల పాటు కరెంటు సరఫరా నిలిచిపోయింది. గ్రామస్థులు గంటల తరబడి కరెంట్ కోసం ఎదురు చూస్తూ అవస్థలు పడ్డారు. జ్వరాల బారిన పడ్డవారు కరెంట్ లేక నరకయాతన అనుభవించారు. ఈ విషయాన్ని విద్యుత్తు సిబ్బందికి ఫోన్ చేసి సమాచారం ఇచ్చినా స్పందించలేదు. అరగంటలో వస్తామని రాత్రి వరకు రాలేదు. రాత్రి ఫోన్ చేస్తే తాము అందుబాటులో లేమని నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారు. చేసేదిలేక గ్రామంలోని యువకులు రామచంద్రాపురం సెంటర్‌లోని ట్రాన్స్‌ఫార్మర్ పక్కన ఉన్న స్తంభం వద్ద జంపర్ తెగినట్టు గుర్తించారు. మరమ్మతులు చేసుకుంటామని విద్యుత్తు అధికారులకు చెప్పి ఎల్‌సీకి అనుమతితీసుకున్నారు. యువకులు స్తంభం ఎక్కి.. జంపర్ వేసి విద్యుత్తు సరఫరాను పునరుద్ధరించడంతో సమస్య తీరింది. గంటల తరబడి కరెంటు లేక ఇబ్బందులు పడితే.. అధికారులు పట్టించుకోకపోవడంపై గ్రామస్థులు అసహనం వ్యక్తంచేశారు.

ఇది బీఆర్ఎస్ మార్క్ పాలన

బీఆర్ఎస్ పాలనలో నిరుడు వర్షాకాలంలో నల్లగొండ జిల్లాలో కరెంటు సమస్య తలెత్తితే వానను కూడా లెక్కచేయకుండా ఓ లైన్‌మన్ కరెంటు సరఫరాకు నడుంబిగించాడు. కింద ఏరులా నీరు పారుతున్నా లెక్కచేయకుండా కరెంటు స్తంభం ఎక్కి విద్యుత్తును పునరుద్ధరించిన చిత్రం.

విద్యుత్తు అంతరాయం మానవ తప్పిదం కాదు

- 'నమస్తే తెలంగాణ' కథనానికి విద్యుత్తు అధికారి స్పందన

వరంగల్‌చౌరస్తా, ఆగస్టు 20: వరంగల్ నగరంలోని కాకతీయ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో విద్యుత్తు అంతరాయం మానవ తప్పిదం వల్ల జరగలేదని ఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ మధుసూదన్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆగస్టు 19న కురిసిన వర్షం కారణంగా విద్యుత్తు లైన్‌పై చెట్ల కొమ్మలు విరిగిపడటంతో దవాఖానకు కరెంటు సరఫరా నిలిచిపోయిందని పేర్కొన్నారు. వెంటనే సిబ్బంది కొమ్మలను తొలగించి మరమ్మతులు చేసి దవాఖానకు విద్యుత్తు సరఫరాను పునరుద్ధరించినట్టు ఎస్ఈ వివరించారు.

నల్లా కనెక్షన్లకు 30వేలు లంచం

- ఏసీబీకి చిక్కిన మణికొండ జలమండలి మేనేజర్

మణికొండ, ఆగస్టు 20: మణికొండ మున్సిపాలిటీ జలమండలి మేనేజర్ లంచం తీసుకుంటూ మంగళవారం ఏసీబీకి పట్టుబడింది. హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్‌సప్లయ్ అండ్ సీవరేజ్ బోర్డు డివిజన్-18 మణికొండ మేనేజర్‌గా స్ఫూర్తిరెడ్డి, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగిగా నవీన్‌గౌడ్ పని చేస్తున్నారు. మున్సిపాలిటీ పరిధిలోని నెక్నాంపూర్ వెంకటేశ్వరకాలనీకి చెందిన బొమ్మ ఉపేంద్రనాథ్‌రెడ్డి కొత్త బిల్డింగ్‌కు రెండు నీటి కనెక్షన్ల కోసం అధికారులను కలిశాడు. ఇందుకు మేనేజర్ స్ఫూర్తిరెడ్డి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి ద్వారా ఉపేంద్రనాథ్‌రెడ్డి నుంచి రూ.30 వేలు డిమాండ్ చేశారు. దరఖాస్తులు సరిగ్గానే ఉన్నా కనెక్షన్లు ఎందుకు ఇవ్వరని బాధితుడు ప్రశ్నించాడు. డబ్బులు ఇస్తేనే కనెక్షన్లకు అనుమతి ఇస్తామని చెప్పడంతో ఏసీబీని ఆశ్రయించాడు. మంగళవారం స్ఫూర్తిరెడ్డి, నవీన్‌గౌడ్ బాధితుడి నుంచి డబ్బులు తీసుకుంటుండగా అధికారులు పట్టుకున్నారు. ఇద్దరిని అరెస్టు చేసి పీఆర్ఎల్ ఎదుట హాజరుపర్చినట్టు తెలిపారు.

సీతక్క అనుచరుడి ఇసుక దందా

మొదటిపేజీ తరువాయి...

చేయడంతో మంగళవారం సోషల్ మీడియా వేదికగా చక్కర్లు కొట్టింది. ఈ ఘటనపై ఓ లారీ డ్రైవర్ ఫోన్‌లో స్పందిస్తూ.. శ్రీనివాస్‌రెడ్డితో వాగ్వాదం జరిగింది వాస్తవమేనని స్పష్టం చేశారు. ఇసుక లోడింగ్ కోసం ఒక్కో లారీకి రూ.4,500 చెల్లించామని, అయినప్పటికి లోడింగ్ విషయంలో ఆలస్యం జరగడంతో తాము నిలదీసినట్టు చెప్పారు. ఈ క్రమంలో శ్రీనివాస్‌రెడ్డి డ్రైవర్లను దుర్భాషలాడగా తామంతా లారీలను నిలిపివేసి అక్కడే రోడ్డుపై ధర్నా కూడా చేశామని తెలిపారు. ఇది జరిగిన మరుసటి రోజు లారీల్లో ఇసుక లోడ్ చేసి పంపించారని వివరించారు. కాగా, ఈ వీడియోపై సదరు కాంగ్రెస్ నాయకుడు శ్రీనివాస్‌రెడ్డి సోషల్ మీడియా వేదికగా మంగళవారం రాత్రి స్పందించారు. 'ఈ ఘటనకు మంత్రి సీతక్కతోపాటు కాంగ్రెస్ పార్టీకి ఎలాంటి సంబంధం లేదు. నా బతుకు దెరువు కోసం ఇసుక క్వారీ యజమాని వద్ద గుమస్తాగా పనిచేస్తున్నా. ఇసుక లారీలను క్రమ పద్ధతిలో లోడింగ్ చేసే క్రమంలో జరిగిన గొడవను వీడియో తీసి సోషల్ మీడియా ద్వారా కొందరు వైరల్ చేశారు. వారిని గుర్తించి చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటా'నని తెలిపారు. లారీ డ్రైవర్లు రోడ్డెక్కి ధర్నా చేసినా, లారీలను ఆపినా ఈ వ్యవహారం బయటకు పొక్కక పోవడంలో అధికారులు పాత్ర ఉందా? లేక రాజకీయ ఒత్తిళ్లు పనిచేశాయా? అనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

రాష్ట్రంలో కుండపోత వాన

- యాదగిరిగుట్టలో 17 సెం.మీ
- గ్రేటర్ హైదరాబాద్‌లో జడివాన బీభత్సం
- వరదలో కొట్టుకొచ్చిన మృతదేహం
- నిండిన చెరువులు, కుంటలు, పారిన వాగులు
- అయిజ మండలంలో 13.33 సెం.మీ

గద్వాల జిల్లా అయిజ పీహెచ్‌సీ ఆవరణలో నిలిచిన నీటిలో వాహనంపై వెళ్తున్న సిబ్బంది

భూదాన్‌పోచంపల్లి మండలం జూలూరు-రుద్రవెల్లిలో లెవెల్ బ్రిడ్జి పైనుంచి ఉధృతంగా ప్రవహిస్తున్న మూసీ

మహబూబ్‌నగర్ నెట్‌వర్క్/యాదాద్రి భువనగిరి/సిటీబ్యూరో, ఆగస్టు 20 (నమస్తే తెలంగాణ): ఉపరితల ద్రోణి ప్రభావంతో రాష్ట్రంలో వర్షాలు దంచికొడుతున్నాయి. మంగళవారం తెల్లవారుజామున జల్లులతో మొదలైన వర్షం.. తెల్లారేసరికి కుండపోతగా కురిసింది. చెరువులు, కుంటలు నిండిపోయి వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహించాయి. 2 గంటలపాటు ఏకధాటిగా కురిసిన వర్షానికి గ్రేటర్ హైదరాబాద్ అతలాకుతలం అయ్యింది. భారీగా వరద నీరు చేరి రహదారులు చెరువులను తలపించాయి. మ్యాన్‌హోల్స్ పొంగిపొర్లాయి. వర్షపు నీరు నిలిచి భారీగా ట్రాఫిక్ స్తంభించింది. రాంనగర్ ప్రేయర్ పవర్ చర్చి ప్రాంతానికి చెందిన బీ విజయ్ కుమార్ (43) ఇంటిముందు అరుగుపై నిద్రిస్తుండగా.. ఒక్కసారిగా వచ్చిన వదరలో చిక్కుకుని ఊపిరాడక మృత్యువాత పడ్డాడు. పంజాగుట్ట సుఖ్‌నివాస్ అపార్ట్‌మెంట్ వద్ద పిడుగుపడి కారు, ఎల్బీ స్టేడియం ప్రహరీ కూలి పోలీస్ వాహనం ధ్వంసం అయ్యాయి. అత్యధికంగా ఖైరతాబాద్ మండలంలో 12.5 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. వరద నుంచి మధ్యాహ్నానికి తేరుకున్నా.. అస్తవ్యస్తంగా మారిన జనజీవనంపై సాయంత్రం వరుణుడు మళ్లీ ఉగ్రరూపం చూపాడు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అవసరం ఉంటే తప్ప బయటకు రావొద్దని జీహెచ్ఎంసీ అధికారులు హెచ్చరికలు జారీచేశారు. ఉమ్మడి పాలమూరు జిల్లా వ్యాప్తంగా.. జోగుళాంబ గద్వాల, నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్, వనపర్తి జిల్లాల్లో భారీ వర్షం కురిసింది. వాగులు, వంకలు, చెరువులు అలుగులు పోశాయి. అయిజ-కర్నూల్, అయిజ-ఎమ్మిగనూర్ అంతర్రాష్ట్ర రహదారులతోపాటు ఉత్తనూర్-సింధనూర్, అయిజ-తూంకుంట, అయిజ-చిన్నతాండ్రపాడు రోడ్లపై వాగులు ఉధృతంగా పారడంతో రాకపోకలు నిలిచిపోయాయి. అయిజ-పులికల్ రోడ్డులోని పోలోని వాగుపై డైవర్షన్ రోడ్డు కొట్టుకుపోయి, పొలాలు నీటి మునిగాయి. కంది, పత్తి, వరి దెబ్బతినడంతో రైతులు ఆందోళన చెందారు. అయిజలో 13.33 మి.మీ. వర్షపాతం నమోదైంది. 14 ఏండ్లల్లో ఎప్పుడూ ఇంత వర్షం కురవలేదని మండల రైతులు పేర్కొన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో రోడ్లన్నీ జలమయమయ్యాయి. పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. భూదాన్ పోచంపల్లి నుంచి బీబీనగర్ వెళ్లే మార్గంలో రుద్రవెల్లి దగ్గర మూసీనది పొంగిపొర్లుతున్నది. రాకపోకలు బంద్ అయ్యాయి. యాదగిరిగుట్టలో 17 సెంటీమీటర్లు, భువనగిరిలో 13.2 సెం.మీ. వర్షపాతం నమోదైంది.

24 వరకు భారీ వర్షాలు.. పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్

హైదరాబాద్, ఆగస్టు 20 (నమస్తే తెలంగాణ): వచ్చే ఐదు రోజులు తెలంగాణలో భారీ వర్షాలు కురిసే సూచనలు ఉన్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఈ నెల 24 వరకు పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, వికారాబాద్, నారాయణపేట, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్టు వెల్లడించింది.

మంగళవారం కురిసిన వర్షానికి మక్తల్ మండలం దాసరిదొడ్డి శివారులో గండిపడిన సంగంబండ లో లెవెల్ కాల్వ

భీమా కాల్వకు గండి

నాడు ఆర్భాటంగా ప్రారంభించిన మంత్రులు.. నాణ్యతలేక ఐదు నెలలకే కోత

మక్తల్, ఆగస్టు 20 : నారాయణపేట జిల్లా మక్తల్ నియోజకవర్గంలో బీడు భూములకు సాగునీరు అందించాలన్న లక్ష్యంతో సంగంబండ పెద్దవాగుపై నిర్మించిన చిట్టెం నర్సిరెడ్డి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ లెఫ్ట్ లోలెవెల్ కెనాల్‌కు గండిపడింది. మంగళవారం కురిసిన వర్షానికి నీటి ఉధృతి పెరగడంతో కోతకు గురై పంట పొలాలను ముంచెత్తింది. కేసీఆర్ ప్రభుత్వం సంగంబండ నిర్వాసితులకు కూలీ డబ్బులు చెల్లించేందుకు 2023 ఆగస్టు 24న జీవో 925 తీసుకొచ్చింది. సంగంబండ, ఉజ్జల్లి, గార్లపల్లికి రావాల్సిన రూ.26,35,23,410 విడుదల చేసింది. తర్వాత అసెంబ్లీ ఎన్నికల కోడ్ రావడంతో నిధుల చెల్లింపు జరగలేదు. తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కారు ఈ నిధులను తామే విడుదల చేసినట్టు స్థానిక ఎమ్మెల్యే ముంపు గ్రామాలు తిరిగి ప్రచారం చేసుకున్నారు. 400 మీటర్ల బండను పగలగొట్టేందుకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి గాలి మోటర్‌లో ఇక్కడికొచ్చి హల్‌చల్ చేశారు. గాలి మాటలు చెప్పి ప్రజలను నమ్మించే ప్రయత్నం చేశారు. తర్వాత చేపట్టిన కాల్వ పనులు నాసిరకంగా ఉండటంతో చిన్నపాటి వర్షానికే గండిపడింది. దీంతో నీరంతా వృథాగా పోయి సమీపంలోని పంటల పొలాలను ముంచెత్తింది. నాసిరకం పనులతో కాల్వ తెగిపోతుండటంతో రైతులు ఆందోళన వ్యక్తంచేశారు.



'నమస్తే తెలంగాణ' కార్టూనిస్టుకు అరుదైన అవార్డు

స్విట్జర్లాండ్ ఎంబసీ కార్టూన్ పోటీల్లో మృత్యుంజయ్‌కు బహుమతి

హైదరాబాద్, ఆగస్టు 20 (నమస్తే తెలంగాణ): 'నమస్తే తెలంగాణ' కార్టూన్ ఎడిటర్ చిలువేరు మృత్యుంజయ్‌కు అరుదైన అవార్డు లభించింది. ఢిల్లీలోని స్విట్జర్లాండ్ ఎంబసీ భారత్-స్విస్ మైత్రీ అంశంపై నిర్వహించిన కార్టూన్ పోటీల్లో మృత్యుంజయ్ కార్టూన్‌కు బహుమతి వచ్చింది. దేశవ్యాప్తంగా వచ్చిన కార్టూన్లలో 19 కార్టూన్లను ఎంపిక చేసినట్టు, విజేతలకు నగదు పారితోషకం ఇవ్వనున్నట్టు స్విట్జర్లాండ్ ఎంబసీ కల్చరల్ ప్రోగ్రాం ఆఫీసర్ తనీమా మణికంటల తెలిపారు. 'స్విట్జర్లాండ్-ఇండియా 75 : సక్సెస్ స్టోరీస్ టు బీ కంటిన్యూ' పేరిట ఈ కార్టూన్లను కేరళ కార్టూన్ అకాడమీ సహకారంతో ఈ నెల 21 నుంచి 25 వరకు కొచ్చిలో జరిగే నేషనల్ కార్టూన్, క్యారికేచర్ ఫెస్టివల్ క్యారిటూన్‌లో ప్రదర్శించనున్నారు. లలితకళా అకాడమీ చైర్మన్ మురళి అధ్యక్షతన స్విట్జర్లాండ్ ఎంబసీ కాన్సులేట్ జనరల్ ప్యాట్రిక్ ముల్లర్ ఈ ప్రదర్శనను ప్రారంభిస్తారని తెలిపారు. కల్చరల్ సెంటర్ డైరెక్టర్ అనిల్ ఫిలిప్, కార్టూన్ డైరెక్టర్ రతీశ్ రవి, కేరళ కార్టూన్ అకాడమీ చైర్మన్ సుధీర్‌నాథ్, సెక్రటరీలు సతీశ్, బాలమురళీకృష్ణన్ పాల్గొంటారని నిర్వాహకులు వెల్లడించారు. ఈ ప్రదర్శనను స్విట్జర్లాండ్‌లోనూ ప్రదర్శించనున్నట్టు తనీమా మణికంటల తెలిపారు.

ఈడీ తీరుపై 'సుప్రీం' అసహనం

- కౌంటర్ ఎందుకు దాఖలు చేయలేదని ప్రశ్న
- 27కు ఎమ్మెల్సీ కవిత బెయిల్ పిటిషన్‌పై విచారణ

హైదరాబాద్, ఆగస్టు 20 (నమస్తే తెలంగాణ): ఎమ్మెల్సీ కవిత బెయిల్ వ్యవహారంలో ఈడీ తీరును సుప్రీంకోర్టు తప్పుబట్టింది. ఈ విషయంలో వచ్చే గురువారంలోగా కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. తదుపరి విచారణను 27కు వాయిదా వేసింది. కస్టడీలో ఉన్న కవిత.. బెయిల్ కోసం సుప్రీంకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. ఆమె పిటిషన్‌పై మంగళవారం సుప్రీంకోర్టులో జస్టిస్ జస్టిస్ గవాయ్, జస్టిస్ విశ్వనాథన్ ధర్మాసనం విచారణ జరిపింది. ఈ కేసులోనే నిందితులుగా ఉన్న ఢిల్లీ సీఎం అర్వింద్ కేజ్రీవాల్, ఉపముఖ్యమంత్రి మనీశ్ సిసోడియాకు కోర్టు బెయిల్ మంజూరు చేసిన విషయాన్ని కవిత తరపు న్యాయవాది ముకుల్ రోహత్గి గుర్తుచేశారు. ఇదే రీతిన కవితకు మధ్యంతర బెయిల్ మంజూరు చేయాలని అభ్యర్థించారు. ఈ కేసులో సీబీఐ కౌంటర్ దాఖలు చేసిందని, ఈడీ ఇంకా దాఖలు చేయాల్సి ఉందని ఈడీ తరపు న్యాయవాదులు నివేదించారు. దీంతో ధర్మాసనం ఈడీ తీరుపై అసహనం వ్యక్తం చేసింది. హైకోర్టులో కేసు డైరీలో ఉండగా కౌంటర్ దాఖలు చేసేందుకు ఆలస్యం ఎందుకైందని ప్రశ్నించింది. శుక్రవారం వరకు కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. బెయిల్‌కు కవిత అర్హురాలని ఆమె న్యాయవాదులు ధర్మాసనానికి నివేదించారు.

బెయిల్ వస్తుందని ఆశిస్తున్నాం: వేముల

ఎమ్మెల్సీ కవితకు బెయిల్ వస్తుందని మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి పేర్కొన్నారు. కవితకు బెయిల్ రాకుండా ఈడీ కాలయాపన చేస్తుందనే అనుమానాలు ఈడీ తీరుతో నిరూపితమైందనారు. బెయిల్ పిటిషన్‌పై విచారణ నేపథ్యంలో మాజీ మంత్రులు వేముల ప్రశాంత్‌రెడ్డి, కొప్పుల ఈశ్వర్, వీ శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్సీ రమణ, ఎమ్మెల్యే సంజయ్, నిజామాబాద్ మాజీ ఎమ్మెల్యే గణేష్ గుప్తా ఢిల్లీకి చేరుకున్నారు. తీహార్ జైలులో ఉన్న కవితతో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్సీ రమణ మంగళవారంములాఖత్ అయ్యారు. ఆమె యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు.

కౌలు రైతు బలవన్మరణం

వగ్గెల ప్రసాద్

జూలూరుపాడు, ఆగస్టు 20: పంటకు పెట్టుబడి సాయం అందక ఓ కౌలు రైతు పురుగుల మందుతాగి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండలం శంభునిగూడెంలో మంగళవారం చోటుచేసుకున్నది. పోలీసులక థనం ప్రకారం.. గ్రామానికి చెందిన కౌలు రైతు వగ్గెల ప్రసాద్ (36) కొన్నేండ్లుగా అదే గ్రామంలో భూమిని కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తున్నాడు. ఈ ఏడాది కూడా ఐదెకరాల భూమిని కౌలుకు తీసుకొని పత్తి పంట సాగు చేశాడు. మరో రెండు ఎకరాల భూమిలో వరి నాట్లు వేసేందుకు పెట్టుబడి సాయం కోసం తెలిసిన వారి వద్ద అప్పు అడిగినా పుట్టలేదు. దీంతోపాటు పత్తి పంటకు ఎరువులు, పురుగు మందులు పిచికారీ చేయాల్సి రావడంతో దానికి కూడా అప్పు లభించలేదు. దీంతో మనస్తాపం చెందిన ప్రసాద్ ఈ నెల 19న చేను వద్ద పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు కొత్తగూడెం ప్రభుత్వ దవాఖానకు తరలించగా.. చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. ప్రసాద్‌కు భార్య ఉషారాణి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వీధికుక్కల వీరంగం

- గర్భిణి సహా 10 మందిపై దాడి
- కాలనీవాసుల రాస్తారోకో

శక్కర్‌నగర్, ఆగస్టు 20: నిజామాబాద్ జిల్లా బోధన్‌లోని తట్టికోట్ లో మంగళవారం వీధికుక్కలు బీభత్సం సృష్టించాయి. గర్భిణి, చిన్నారులు సహా 10మందిపై దాడి చేశాయి. కాలనీలో ఆడుకుంటున్న బాలుడిని లాక్కెళ్లేందుకు యత్నించగా స్థానికులు అడ్డుకున్నారు. గాయాలైన వారిని బోధన్ దవాఖానకు తరలించారు. వీధి కుక్కల బెడదను నియంత్రించాలని అధికారులు పట్టించుకోవడం లేదంటూ స్థానికులు ఆందోళనకు దిగారు. ప్రభుత్వ దవాఖాన ఎదుట రహదారిపై బైఠాయించారు. సమాచారం అందుకున్న సీఐ వీరయ్య అక్కడికి చేరుకుని కాలనీవాసులకు సర్దిచెప్పారు. కుక్కల నియంత్రణ చర్యలు చేపట్టకపోతే ఆందోళనను ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు.

కేంద్రానికి రెండు రాష్ట్రాల అభిప్రాయాలు నివేదిస్తాం

- సీతారామ- సీతమ్మసాగర్ బహుళార్థక ప్రాజెక్టుపై జీఆర్ఎంబీ స్పష్టీకరణ

హైదరాబాద్, ఆగస్టు 20 (నమస్తే తెలంగాణ): గోదావరి నదిపై తెలంగాణ నిర్మిస్తున్న సమీకృత సీతారామ-సీతమ్మసాగర్ బహుళార్థక ప్రాజెక్టుపై ఏపీ, తెలంగాణ రాష్ట్రాలు తమ వాదనలు వినిపించాయి. ఈ ప్రాజెక్టు డీపీఆర్‌పై మంగళవారం హైదరాబాద్‌లోని జలసౌధలో రెండు రాష్ట్రాలతో గోదావరి నదీ యాజమాన్య బోర్డు సమావేశం నిర్వహించింది. అభ్యంతరాలు ఉంటే సీడబ్ల్యూసీ వద్ద పరిష్కరించుకోవచ్చని సూచించింది. సమగ్ర ప్రాజెక్టు నివేదికపై (డీపీఆర్) తెలంగాణ, ఏపీ రాష్ట్రాల అభిప్రాయాలను పొందుపర్చుతూ కేంద్ర జల సంఘానికి నివేదిక పంపిస్తామని బోర్డు తెలిపింది. రెండు రాష్ట్రాల మధ్య వాదనలు చోటుచేసుకున్నట్టు తెలిసింది. ప్రాజెక్టుకు సంబంధించి సీడబ్ల్యూసీ ఏపీకి నాలుగుసార్లు లేఖలు రాసింది. అయినా వాళ్లు పట్టించుకోలేదు. తెలంగాణ పూర్తి వివరాలు అందజేసింది. ఏపీ ఇచ్చిన ప్రాజెక్టుల వివరాల మేరకే 531 టీఎంసీలను సీడబ్ల్యూసీ కేటాయించింది. వాస్తవానికి ఏపీ ఇచ్చిన జాబితా, టీఏసీ వివరాల ప్రకారం 518 టీఎంసీలే ఇవ్వాలి. ట్రిబ్యునల్ మేరకు కేటాయింపుల్లో నీటిని వినియోగించుకొనేందుకు మాకు హక్కు ఉన్నది. మీకు అభ్యంతరాలు ఉంటే సీడబ్ల్యూసీ వద్ద తేల్చుకోవాలి' అని తెలంగాణ పేర్కొన్నది.

'స్వచ్ఛ్ బయో'పై ఈడీకి ఫిర్యాదు

మొదటిపేజీ తరువాయి...

విడుదల చేసిన రూ.1,000 కోట్ల పెట్టుబడితో ఎనుముల రేవంత్‌రెడ్డి (తెలంగాణ ముఖ్యమంత్రి), స్వచ్ఛ్ బయో కంపెనీ మధ్య జరిగిన అవగాహన ఒప్పందాన్ని మీ దృష్టికి తేవాలని అనుకుంటున్నాం. స్వచ్ఛ్ బయో ఇద్దరు డైరెక్టర్లలో ఒకరు కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వశాఖలో నమోదైన ఎనుముల రేవంత్‌రెడ్డి సోదరుడు ఎనుముల జగదీశ్‌రెడ్డి కావడం ఆందోళన కలిగిస్తున్నది. డైరెక్టర్ ఎనుముల జగదీశ్‌రెడ్డి కరస్పాండెన్స్ చిరునామా 'ఫిలడెల్ఫియా, యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా' అని ఉంది. దీనిని మీరు గమనించాలి. తెలంగాణ ఐటీ మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. సీఎం కుటుంబ సభ్యులు వ్యాపారం చేయడాన్ని సమర్థించారు. అధికారిక పర్యటనలో సీఎం స్వయంగా ఓ కంపెనీతో వ్యాపారాన్ని ప్రకటిస్తుంటే అది 'కాన్‌ఫ్లిక్ట్ ఆఫ్ ఇంట్రెస్ట్ అండ్ క్విడ్ ప్రోకో'లా అనిపిస్తుంది. సీఎం ఫిలడెల్ఫియా పర్యటనకు కేవలం 15 రోజుల ముందు కంపెనీని విలీనం చేయడం ఇక్కడ గమనార్హం. ఆ కంపెనీ జూబ్లీహిల్స్, హైదరాబాద్ చిరునామాతో ఎంసీఏలో రిజిస్టర్ చేయబడింది. అయితే, అమెరికాలో ఈ కంపెనీని ప్రకటించడం యొక్క ఉద్దేశం ఏమిటి? ఇందులో విదేశీ నిధుల ప్రమేయం ఉందా? మనీలాండరింగ్‌తో ఏదైనా సంబంధం ఉందా? జూబ్లీహిల్స్‌లోని ఓ అపార్ట్‌మెంట్‌లో అధికారికంగా నమోదు చేసిన కార్యాలయంలో కంపెనీ పేరు, కనీసం బోర్డు కూడా లేదు. ఇది కార్పొరేట్ చట్టాన్ని ఉల్లంఘించడమే. ముఖ్యమంత్రి రేవంత్ ఎంవోయూపై సంతకం చేస్తున్న చిత్రంలో సీఎం తమ్ముడితో పాటు హర్ష పసునూరి అనే వ్యక్తి ఉన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి తన వ్యాపార లబ్ధికి తన సోదరుడు జగదీశ్‌తో ఎంవోయూపై సంతకం చేయడం అతిపెద్ద అధికార దుర్వినియోగం. మా విజ్ఞప్తిని ఫిర్యాదుగా స్వీకరించి, స్వచ్ఛ్ బయో డైరెక్టర్లతో పాటు సీఎం రేవంత్‌రెడ్డిపై విచారణ జరిపించాలని ఫిర్యాదులో కోరారు.

జాతీయ మీడియాలో 'స్వచ్ఛ్ బయో' రచ్చ

హైదరాబాద్, ఆగస్టు 20 (నమస్తే తెలంగాణ): సీఎం రేవంత్‌రెడ్డి తన సోదరుడు జగదీశ్వర్‌రెడ్డికి చెందిన స్వచ్ఛ్‌బయో కంపెనీతో చేసుకున్న ఒప్పందం ఇప్పుడు జాతీయస్థాయిలోనూ చర్చనీయాంశమైంది. తన సొంత తమ్ముడితో కంపెనీ పెట్టించి దానితో రాష్ట్ర ప్రభుత్వం తరపున సీఎం ఒప్పందం చేసుకోవడం విడ్డూరంగా ఉందంటూ జాతీయ మీడియాలో కథనాలు మొదలయ్యాయి. అసలు స్వచ్ఛ్ బయో కంపెనీ ఎవరిది? దాని పుట్టుపూర్వోత్తరాలపై 'సీఎన్ఎన్' చానల్ ప్రత్యేక కథనాలను ప్రసారం చేసింది. 15 రోజుల క్రితమే ఏర్పాటైన కంపెనీతో ప్రభుత్వం వేల కోట్ల రూపాయల ఒప్పందం ఎలా చేసుకున్నదని 'ఇండియా టుడే' ప్రత్యేక కథనంలో ప్రశ్నించింది. 'మనీ కంట్రోల్' కూడా సీఎం హోదాలో రేవంత్‌రెడ్డి, స్వచ్ఛ్ బయో కంపెనీ తరపున ఆయన తమ్ముడితో చేసుకున్న ఒప్పందాలపై వార్తలను ప్రసారం చేసింది. ప్రముఖ న్యూస్ ఏజెన్సీ 'ఐఏఎన్ఎస్' కూడా దీనిపై కథనాలు రాసుకొచ్చింది.

ఆమ్రపాలి అదనపు పోస్టులకు కత్తెర

- ఇప్పటివరకు ఆమె చేతిలో నాలుగు బాధ్యతలు
- ఇక జీహెచ్ఎంసీ కమిషనర్ పదవికే పరిమితం
- అదనపు పోస్టింగ్‌ల నుంచి రిలీవ్ చేసిన సర్కారు
- మరో ఐదుగురు ఐఏఎస్ అధికారుల బదిలీ

హైదరాబాద్/సిటీబ్యూరో, ఆగస్టు 20 (నమస్తే తెలంగాణ): ఐఏఎస్ అధికారిని ఆమ్రపాలి కాట విషయంలో రేవంత్ రెడ్డి సర్కారు కీలక నిర్ణయం తీసుకున్నది. ప్రభుత్వం ఏర్పడగానే ఆమెకు విశేష ప్రాధాన్యత ఇస్తూ కట్టబెట్టిన పదవులన్నింటికీ ఇప్పుడు కత్తెర పెట్టింది. ఆమ్రపాలికి ఉన్న అదనపు పోస్టులను తొలగిస్తూ మంగళవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేశారు. ఇక ఆమె గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్(జీహెచ్ఎంసీ) కమిషనర్‌గానే పూర్తిస్థాయి బాధ్యతల్లో కొనసాగనున్నారు. ఇప్పటివరకు ఆమ్రపాలికి జీహెచ్ఎంసీ కమిషనర్ బాధ్యతలతో పాటు హెచ్ఎండీఏ జాయింట్ కమిషనర్, మూసీ రివర్ బోర్డు ఎండీ, హెచ్‌జీసీఎల్ ఎండీ వంటి కీలక బాధ్యతలను ప్రభుత్వం అప్పగించిన సంగతి తెలిసిందే. ఒకే ఐఏఎస్‌కు, అందునా అనేక మంది సీనియర్ ఐఏఎస్‌లను కాదని జూనియర్‌కు ఇన్ని కీలక బాధ్యతలు అప్పగించడం పట్ల తీవ్ర విమర్శలు వచ్చాయి. పైగా ఆమె ఏ బాధ్యతకూ సంపూర్ణ న్యాయం చేయలేకపోతున్నారనే అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ముఖ్యంగా కోటి మందికి పైగా జన